క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



నిజామాబాద్ సిటీ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ముగ్గు పోసే కార్యక్రమం చేపడితే ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని నాగారంలోని దొడ్డి కొమురయ్యనగర్ కాలనీ వాసులు ఆరోపించారు. గురువారం కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి కాలనీవాసులు, ఐద్వా నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరుచేసిన స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటామంటే అడ్డుకోవటమేమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో బెజుగం సుజాత, యశోద, మంగళ్ బాయ్, లక్ష్మీబాయి, రజియా, జయశ్రీ, రమాబాయి తదితరులు పాల్గొన్నారు.

వైశాక్షి హనుమంతరావు సేవలు మరువలేనివి



నిజామాబాద్ నాగారం: ఎలక్ట్రిషియన్లకు వైశాక్షి హనుమంతరావు అందించిన సేవలు మరువలేనివని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వైర్‌మన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి అన్నారు. అసోసియేషన్ ఉమ్మడి ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వైశాక్షి హనుమంతరావు సంతాప సభను గురువారం నగరంలోని సత్య ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమంతరావు కొడుకు వైశాక్షి సంతోష్ మాట్లాడుతూ కుటుంబం కంటే ఎలక్ట్రిషియన్ సంఘం కోసమే ఎక్కువగా తన సమయాన్ని వెచ్చించారన్నారు. వైఎస్ఆర్ హయాంలో లేబర్‌కార్డు, ఇన్సూరెన్స్, ప్లాట్లు అందజేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో కాపర్ కంపెనీ సీఈవో కృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సలీం, టౌన్ ప్రెసిడెంట్ రమేశ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పాత స్థానంలోనే కొనసాగించాలి



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా వీఆర్ఏలను పాత స్థానంలోనే కొనసాగించాలని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దండి వెంకట్ కోరారు. గురువారం కలెక్టరేట్ సముదాయంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 60 మంది వీఆర్ఏలను పారిశుద్ధ్య పనులకు కేటాయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో మహిళా వీఆర్ఏలు మంజుల, సుమలతా, పద్మ, నర్సుబాయి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఆర్‌పీఎఫ్, రైల్వేపోలీసులు, లోకల్ పోలీసులు డాగ్ స్క్వాడ్ టీమ్‌లు గురువారం తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లు, రైళ్లు, పార్సిల్ కార్యాలయం, పార్కింగ్ ప్రాంగణం, తదితర ప్రాంతాల్లో వారు తనిఖీలు చేపట్టారు. ఆర్‌పీఎఫ్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై హరికృష్ణ, రైల్వే ఎస్సై సాయిరెడ్డి, తదితరులు ఉన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్

- భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు సూచించిన అగ్నిమాపక శాఖ



లోతట్టు ప్రాంతంలో మాక్ డ్రిల్‌లో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఖలీల్‌వాడి: భారీ వర్షాల సూచన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ రోడ్డులోని లోతట్టు ప్రాంతాలు, కెనాల్ ప్రాంతంలో అగ్నిమాపకశాఖ అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. భారీ వర్షాలకు నీరు ఇళ్లలోకి వచ్చి చేరితే, రక్షణ చర్యలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఇళ్లలోకి నీరు వస్తే వెంటనే ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని ప్రజలకు అగ్నిమాపకశాఖ అధికారి శంకర్ సూచించారు. సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీసీ రవిబాబు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం డిప్యూటీ కమిషనర్ రవిబాబు పరిశీలించారు. మహాలక్ష్మినగర్, బ్యాంక్‌కాలనీ, నాందేవ్‌వాడ, ముజాహిద్‌నగర్ కాలనీల్లో శానిటరీ సూపర్‌వైజర్‌తో కలిసి ఆయన పర్యటించారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, ట్రాక్టర్లలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని సూచించారు. సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, సునీల్ తదితరులున్నారు.

వేగవంతంగా 'డబుల్ ఇళ్ల' కేటాయింపు ప్రక్రియ



నగరంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాలను పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు కేటాయించే ప్రక్రియ వేగవంతం చేసినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు గురువారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు స్థానికంగా నెలకొని ఉన్న స్థితిగతులను కలెక్టరేట్‌లో ఆయనకు వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా అర్హులను గుర్తించి ఆమోదం నిమిత్తం జిల్లా ఇన్‌చార్జి మంత్రికి లబ్ధిదారుల జాబితా పంపుతామని అన్నారు. ప్రధానంగా ఇల్లు, నివాస స్థలం లేని నిరుపేద కుటుంబాలు, సఫాయి కర్మచారీలు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇళ్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పవన్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ రంజిత్, హౌసింగ్ అధికారి నివర్తి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు మెరుగుపర్చాలి


- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- వైద్యశాఖ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు మరింతగా మెరుగుపడాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. వైద్యవిధాన పరిషత్ పరిధిలో కొనసాగుతున్న జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరుపై కలెక్టర్ గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఆయా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఖాళీలు, వాటి భర్తీకి చేపట్టిన చర్యల గురించి జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్‌ను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖాళీల భర్తీ కోసం ఉన్నతాధికారులకు పంపిన ప్రతిపాదనలను పరిశీలించారు. విభాగాల పనితీరును సమీక్షించారు. కాగా, వర్ని, ధర్పల్లి తదితర ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రుల భవన నిర్మాణాల పనులు వేగంగా, నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

200 ట్రిప్పులు.. రూ.3000



ఇందల్వాయి టోల్‌ప్లాజా

- హైవేపై నేటి నుంచి వార్షిక టోల్ పాస్ అమలు
- రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా పాస్‌లు పొందే అవకాశం

ఇందల్వాయి(నిజామాబాద్ రూరల్): జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ప్రయాణం మరింత సులభంగా, చవకగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నేటి నుంచి వార్షిక టోల్ పాస్ విధానాన్ని అమలు చేయనుంది. ఒకసారి రూ.3వేలు చెల్లిస్తే సంవత్సరంలో టోల్‌గేట్ గుండా 200 ట్రిప్పులు వెళ్లవచ్చు. ఒకసారి టోల్‌గేట్ దాటితే ఒక ట్రిప్పుగా పరిగణిస్తారు. ఈ వార్షిక పాస్ కోసం వాహనదారులు ఇప్పుడు ఉన్న ఫాస్టాగ్‌కే రాజ్‌మార్గ్ యాత్ర యాప్ లేదా ఎన్‌హెచ్ఏఐ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకొని రూ.3వేలు చెల్లిస్తే, రెండు గంటల్లో యాక్టివేట్ అవుతుంది. కాలపరిమితి లేదా 200 ట్రిప్పులు పూర్తవగానే వాహనదారుడి ఫాస్టాగ్ పాత విధానం (పే ఫర్ యూజ్) లోకి మారిపోతుంది.

తెలుపు రంగు నంబర్ ప్లేట్ ఉంటేనే..

ఈ వార్షిక టోల్‌పాస్ తెలుపు రంగు నంబరు ప్లేటు కలిగిన వాహనాలకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుంది. పసుపు రంగు నంబరు ప్లేటు కలిగిన వాహనాలకు వర్తించదు. ఒక వాహనంపై పొందిన వార్షిక పాస్ మరో వాహనానికి వర్తించదు. వార్షిక పాస్ తీసుకోవటం తప్పనిసరి కాదు. రాష్ట్ర రహదారులు, ఔటర్ రింగ్ రోడ్లు, మున్సిపల్ టోల్స్ వద్ద ఈ వార్షిక టోల్‌పాస్ చెల్లుబాటు కాదు.

ఎంతో ఉపయోగం..



వ్యాపార పనుల నిమిత్తం ఇదివరకు నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు నెలలో ఐదారు సార్లు వెళ్లేవాన్ని. ఈ క్రమంలో టోల్ చార్జీలే రెండు మూడు వేల రూపాయలు కట్టేవాన్ని. వార్షిక టోల్‌పాస్ ద్వారా వందల్లోనే కట్టాల్సి రావడం సంతోషకరం. ప్రయివేటు వాహనదారులకు ఈ పాస్ ఎంతో ఉపయోగకరం.

–కుంట గంగారెడ్డి, నల్లవెల్లి

సైబర్ క్రైంపై అవగాహన

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు రైల్వే, ఆర్‌పీఎఫ్ పోలీసులు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ఎస్సై సాయిరెడ్డి మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్‌మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.

కల్వర్టుల పరిశీలన



డిచ్‌పల్లి: మండలంలోని కొరట్‌పల్లి గ్రామాన్ని ఎంపీడీవో రాజ్‌వీర్, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఈఈ ఇషాక్ అలీలు గురువారం సందర్శించారు. కొరట్‌పల్లి నుంచి జక్రాన్‌పల్లి మండలం కలిగోట్‌-చింతలూరు గ్రామాలకు వెళ్లే రోడ్డుపై ఉన్న కల్వర్టులను వారు పరిశీలించారు. ప్రజలు రాకపోకలు సాగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కొరట్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి నగేశ్‌కు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రేషన్‌కార్డుల పంపిణీ



నిజామాబాద్ రూరల్: సారంగాపూర్‌లోని 13వ డివిజన్‌లో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుంచపు నాగేశ్ పంపిణీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. నూతన రేషన్‌కార్డుల మంజూరుకు కృషి చేసినందుకు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, రామ్‌సింగ్, రవి, శ్రీరాములు, ఇలియాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో ఘనంగా తీజ్



సిరికొండ: మండలంలోని పాకాల గ్రామంతోపాటు గంగారాంనాయక్ తండాలో తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గోధుమ మొలకల బుట్టలతో బంజారా మహిళలు పాటలు పాడుతూ సంప్రదాయ రీతిలో నృత్యాలు చేశారు. ఊరేగింపుగా వెళ్లి గోధుమ మొలకలను చెరువులో నిమజ్జనం చేశారు. తండా పెద్దలు ఆనంద్‌నాయక్, భూపతినాయక్, గంగానాయక్, రమేశ్‌నాయక్, తిరుపతినాయక్, రవినాయక్, బీమ్లానాయక్, లాల్‌సింగ్‌నాయక్, గ్రామ అధ్యక్షుడు సంతోష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం



అర్గుల్‌లో వ్యవసాయ గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- అర్గుల్‌లో రూ. కోటి నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి: ఇందిరమ్మ రాజ్యంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. గురువారం జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్‌లో రూ. కోటి నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటివరకు రాష్ట్రంలో రెండు కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి రూ.6800 కోట్లు చెల్లించిందన్నారు. రైతులకు ఉచిత కరెంటు, రైతు రుణమాఫీ, పేదల గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, డ్వాక్రా సంఘాలకు ఒక్కో గ్రూప్ కు రూ. 15 లక్షలు వడ్డీ లేని రుణాలు, వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు రేషన్ కార్డులు, ఒక్క ఇల్లు మంజూరు చేయలేదన్నారు. బీసీలకు 42 శాతం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు, బీసీ రిజర్వేషన్లకు అనుకూలమా, వ్యతిరేకమా, స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రభుత్వం మహిళలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. అనంతరం చాకలి ఐలమ్మ ముని మనుమరాలు శ్వేతను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయి రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్, నాయకులు చిన్నారెడ్డి, చిన్న సాయి రెడ్డి, ఆర్మూర్ గంగారెడ్డి, శేఖర్, కాటిపల్లి నర్సారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సత్యం రెడ్డి, వసంతరావు, మద్దుల రమేశ్, గోర్త పద్మ , రజక సంఘ సభ్యులు సాగర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



మోపాల్‌లో జాతీయ జెండాలతో చిన్నారులు



ధర్పల్లిలో..

మోపాల్: మండలకేంద్రంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు జాతీయ జెండాను ఎగురవేశారు. జెండాలను చేతబూని దేశ భక్తి, జాతీయ భావం, దేశ ప్రాధాన్యతను పిల్లలకు బీజేపీ నాయకులు నవీన్‌రెడ్డి తెలియజేశారు. చిన్నారులు అక్షర, ఆకృతి, ఖుషి, చిన్ను, కన్నయ్య, అభినయ్, సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి మండల కేంద్రంలో..

ధర్పల్లి: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తిరంగా యాత్ర చేపట్టారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు మువ్వన్నెల పతాకాలతో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, గంగాదాస్, కర్క గంగారెడ్డి, శ్రీకాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

సహజీవనానికి నిరాకరించడంతోనే హత్య

- నగరంలో లభ్యమైన మహిళ మృతదేహం కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడి అరెస్టు

ఖలీల్‌వాడి: సహజీవనానికి నిరాకరించడంతో మహిళను హత్య చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఇటీవల నగరంలో లభ్యమైన మహిళ మృతదేహం కేసును పోలీసులు ఛేదించి, నిందితుడిని పట్టుకున్నారు. వివరాలు ఇలా.. నగరంలోని బస్టాండ్ పక్కన ఉన్న రైల్వే కాంపౌండ్ వాల్ సమీపంలో ఈనెల 6న ఒక గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యం కాగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు కామారెడ్డి జిల్లా లింగాయపల్లి గ్రామానికి చెందిన గులాల సవితగా గుర్తించారు. మృతురాలితో ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన పల్లె రాకేశ్ అలియాస్ నవీన్ సహజీవనం చేసినట్లు గుర్తించి, అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. తనతో సహజీవనం కొనసాగించటానికి సవిత నిరాకరించడంతో హత్య చేసినట్లు అతడు తెలిపాడు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడు గతంలో చోరీ కేసుల్లో జైలుకి వెళ్లి వచ్చినట్లు వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సుభాష్‌నగర్: జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చిన్న పిల్లలు బయటికి వెళ్లకుండా వారిని గమనించాలని, ముఖ్యంగా కాలువలు, వాగులు, చెరువులు, నీటి ప్రవాహం ఉన్న ప్రదేశాలకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మున్సిపల్, విద్యుత్‌శాఖల అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరికల బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రత కోసం అధికార యంత్రాంగం అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

హాస్టల్ సౌకర్యం కల్పించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించకపోవడంతో గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వర్సిటీ వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు జన్నారపు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి పర్వీన్‌బేగం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్, హిందీ పోస్టులకు టెట్ ఉత్తీర్ణులై బీఏ బీఈడీ, సోషల్ మెథడాలజీ, ఎంపీటీ, హిందీ మెథడాలజీ కలిగి ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి గెస్ట్ ఫ్యాకల్టీగా నెలకు రూ.18 వేల వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అన్ని ధృవపత్రాలతో ఈనెల 20లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి



నిజామాబాద్ రూరల్: విద్యార్థి దశ నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలని భావకవి, కవిత్వ శిక్షకుడు, వైదిక పురోహితుడు తిరుమల శ్రీనివాస్ ఆర్య తెలిపారు. మండల కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల యజమాన్యం పిలుపు మేరకు గురువారం ఆయన పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులకు సాహిత్యంపై మక్కువ పెంచే అనేక విషయాలు తెలియజేశారు. పాఠశాల యజమాన్యం, నిర్వాహకులు ఆచార్యుల బృందం ఆయనను సన్మానించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101,600	వెండి(కిలో)	1,21,000
22 క్యారెట్స్	93,795	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	48	గాజరుగడ్డ	30	60
బెండకాయ	25	50	పచ్చిమిర్చి	30	60
జీరకాయ	25	50	దోసకాయ	20	40
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	50	90	గోబిగడ్డ	10	20
కాకరకాయ	20	40	గోబిపువ్వు	30	60
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	40	80	కరివేపాకు	40	80
మెంతికూర	50	90	చామగడ్డ	40	80
కొత్తిమీర	40	80	చిక్కుడుకాయ	30	60
పుదీనా	40	80	గోరుచిక్కుడు	30	60
క్యాప్సికం	20	40			

–సుభాష్‌నగర్

సంక్షిప్తం

బడిలో కృష్ణాష్టమి వేడుకలు



మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలోగల జ్ఞానోదయ హైస్కూల్‌లో గురువారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో అలరించారు. ఉట్టి కొట్టి సంబురాలు చేసుకున్నారు. ప్రిన్సిపాల్ దేవ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న జిల్లా నాయకులు



నిజామాబాద్ సిటీ: జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం విజయవాడలోని కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర సహకార సంఘం లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నరాల రత్నాకర్, ఆర్మూర్ ఏబీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీకి ఎంపిక



నిజామాబాద్‌నాగారం: చెన్నైలో ఈ నెల 18 నుంచి జరిగే బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు అనికేత్‌రెడ్డి ఎంపికయ్యారు. ది హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జస్టిస్ నవీన్‌రావు, జాయింట్ సెక్రటరీ బస్వరాజు కలిసి 15మందితో కూడిన జట్టును ఎంపిక చేసి ప్రకటించారు. అనికేత్‌రెడ్డిని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రసేన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, కోచ్ సురేష్ అభినందించారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి



నిజామాబాద్ సిటీ: జిల్లాకేంద్రంలోని కోజా కాలనీలోగల ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సయ్యద్ ఖైసర్ కోరారు. ఈమేరకు గురువారం ఆయన హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టిన అప్పటి నగర మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.